TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 110 | గురువారం, ఆగస్టు 22, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### రైతుల కోసం పోరాటం చేయడానికి

## బీఆర్ఎస్ సిద్ధం



హైదరాబాద్: రుణమాఫీ కోసం ఆందోళనలు చేస్తున్న రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు నమోదు చేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ జరగలేదని కాంగ్రెస్ మంత్రులే చెబుతుండడంతో వాళ్లకే సమన్వయం లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గం చేస్తున్న మోసానికి వ్యతిరేకంగా రేపు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నామని, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా రేపు తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేస్తామని తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని కెటిఆర్ ధ్వజమెత్తారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ ఎప్పటి వరకు చేస్తుందో ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు. బిఆర్ఎస్ పాలనలో రైతులకు అన్ని విధాలుగా అండగా ఉన్నామని, ఇప్పుడు రైతుల కోసం పోరాటం చేయడానికి బిఆర్ఎస్ సిద్ధంగా ఉందని పిలుపునిచ్చారు. కోస్గి మండలంలో 20,239 మంది ఉంటే 8527 మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. ఎరుపుమల్లలో యాదగిరి కుటుంబానిని రుణమాఫీ జరగలేదని, ఒకే కుటుంబంలో ఇద్దరు ముగ్గురు ఉంటే ఒకరికి చేస్తామన్నారని, తరువాత ఇతరులకు చేస్తామని చెప్పి రుణమాఫీ ఇంకా ఎందుకు చేయలేదని కెటిఆర్ ప్రశ్నించారు.

### ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం...

## భూ సేకరణ ప్రారంభించండి

హైదరాబాద్: రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నారు. పనుల పురోగతి ఏమిటనే దానిపై రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ సమాచారం తనకు అందజేయాలన్నారు. ఆర్ఆర్ఆర్ ప్రగతిపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కలెక్టర్లు ఈ రహదారి విషయంలో రోజు వారీగా ఏం చేశారు%ౌ% ఏం పురోగతి సాధించారు, దక్షిణ భాగంలో భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం, ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతి రోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందజేయాలన్నారు. భూ సేకరణలోనూ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి–ఆమన్‌గల్–షాద్ నగర్–చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, అదే సమయంలో పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు.



## కవిత బెయిల్ కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు

### బండి సంజయ్...

## సంచలన వ్యాఖ్యలు




హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్టు అయి తీహాడ్ జైల్లో ఉన్న కల్వకుంట్ల కవితకు కాంగ్రెస్ పార్టీయే బెయిల్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ కవితకు బెయిల్ ఇప్పించేందుకు కోర్టులో వాదనలు విన్పిస్తున్నారని అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మున్సిపాలిటీలోని శ్రీ సూరగిరి ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కెసిఆర్ ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. కెసిఆర్ చెప్పిన వారికే రాష్ట్రంలో మంత్రి పదవులు, రాజ్యసభ పదవులు వస్తున్నాయన్నారు. కవిత బెయిల్ కోసం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీ వకీల్‌గా పనిచేశారన్నారు. కేసీఆర్ చెప్పినందుకే తెలంగాణ రాష్ట్రం నుంచి అభిషేక్ మను సింఘ్వీకి తెలంగాణ నుంచి రాజ్యసభ స్థానం వచ్చిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవినీతి, కుటుంబ పార్టీలని విమర్శించారు. కవితకు బెయిల్ వచ్చే అవకాశాలు ఉండటంతో ఆమె కేంద్రంగా విలీనంపై మాటల తూటాలు పేలుతున్నాయి. కూతురు కవితకు బెయిల్ కోసం బీజేపీ పెద్దలతో కేసీఆర్ మిలాఖత్ అయ్యారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. సిఎం రేవంత్ రెడ్డి కూడా పదేపదే ఇవే ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

### జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ కోర్టుకు వెళ్లిన

## కెటిఆర్ టీం

హైదరాబాద్: జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ కెటిఆర్ టీం కోర్టుకు వెళ్లింది. ఎఫ్ టిఎల్ పరిధిలో ఉన్న కట్టడాలపై హైడ్రా కొరడా ఝులిపిస్తుంది. జన్వాడ ఫాంహౌస్ ఎఫ్ టిఎల్ పరిధిలో ఉండడంతో తమ కట్టడాలను హైడ్రా కూల్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. జన్వాడ ఫాంహౌస్ కూల్చకుండా స్టే ఇవ్వాలని కోర్టుకు ప్రదీప్ రెడ్డి వెళ్లారు. కెటిఆర్ అక్రమంగా ఫార్మ్ హౌస్ నిర్మించారని హైడ్రా అధికారులు నోటీసులు అందించారు. గతంలో కెటిఆర్ ఫార్మ్ హౌస్ 111 పరదిలో ఉందని గ్రామ పంచాయతీ అనుమతితో అక్రమంగా కట్టారని రేవంత్ రెడ్డి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో డ్రోన్ ఎగరేసిన అంశంలో రేవంత్ పై కేసు కూడా నమోదు చేశారు. ఆ సమయంలో రేవంత్ రెడ్డి జైలుకు వెళ్లారు. ఇప్పుడు మళ్లీ కెటిఆర్ కు సంబంధించిన జన్వాడ ఫాంహౌస్ కూల్చేందేకు కుట్రలు జరుగుతున్నట్లు వార్తలు హల్ చల్ చేస్తున్నాయి.

## బద్లాపూర్‌లో 72 మంది అరెస్టు



### - ఇంటర్నెట్ సేవల నిలిపివేత

థాణె : మహారాష్ట్ర థాణె జిల్లాలోని బద్లాపూర్‌లో ఇద్దరు కిండర్‌గార్టెన్ బాలికలపై లైం గిక అత్యాచారంపై పెద్దఎత్తున నిరసనల నేపథ్యంలో పట్టణంలో బుధవారం ఇంటర్నెట్ సర్వీసులను నిలిపివేసినట్లు, చాలా వరకు పాఠశాలలను మూసివేసినట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం బద్లాపూర్‌లో రైల్వే స్టేషన్‌లోను, ఇతర ప్రాంతాల్లోను రా ళ్ల రువ్విన సంఘటనల్లో కనీసం 17 మంది నగర పోలీస్ సిబ్బంది, ఎనిమిది మంది రై ల్వే పోలీసులు గాయపడినట్లు, దౌర్జన్యకాం డ సందర్భంగా 72మంది వ్యక్తులను దర్యా ప్తు అధికారులు అరెస్టు చేసినట్లు వారు తెలియజేశారు. అధికారుల సమాచారం ప్రకా రం, పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం అదనపు పోలీస్ బలగాలను మోహరించారు. పట్టణంలో పరిస్థితి క్రమంగా మామూలు స్థాయికి చేరుకుంటున్నది. క్రితం వారం పాఠశాల వాష్‌రూమ్‌లో ఇద్దరు బాలికలపై పాఠశాల స్వీపర్ లైంగిక అత్యాచారం జరిపాడన్న ఆరోపణ నేపథ్యంలో వేలాది మంది నిరసనకారులు స్టేషన్‌లో రైలు పట్టాలను ఆక్రమించుకుని, పాఠశాల భవనంలో విధ్వంసం సృష్టించిన తరువాత మంగళవారం మొత్తం బద్లాపూర్ పట్టణం దాదాపుగా స్తంభించిపోయింది. లైంగిక అత్యాచా రం ఘటనపై నిరసనకారులు పోలీస్ సిబ్బందిపై రాళ్లు రువ్వి, పాఠశాల భవనంలో విధ్వంస కాండకు పాల్పడ్డారు. నిరసనకారులను చెదరగొట్టి, రైళ్ల రాకపోకలకు వీలు కల్పించేందుకు పోలీసులు వారిపై కేన్‌చార్జి చేశారు. డిసిపి సుధాకర్ పథారె 'పిటిఐ'తో మాట్లాడుతూ, నిరసనలు,దౌర్జన్యకాండ నేప థ్యంలో పట్టణంలో ఇంటర్నెట్ సర్వీసులను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

'పట్టణం లో పరిస్థితిని సమీక్షించిన పిమ్మట ఇంటర్నెట్ సర్వీసుల పునరుద్ధరణ జరుగుతుంది' అని ఆయన తెలిపారు. బుధవారం పట్టణం లో చాలా వరకు పాఠశాలలు మూతపడిన ట్లు స్థానికులు తెలియజేశారు. 'ఇద్దరు బాలికలపై లైంగిక అత్యాచారంపై మంగళవారం బద్లాపూర్‌లో నిరసనల సమయంలో ఆగ్రహోదగ్రులైన జనం రాళ్లు రువ్వడంతో ఇద్ద రు అధికారులతో సహా కనీసం 17 మంది నగర పోలీస్ సిబ్బంది గాయపడ్డారు.

నిషేధాజ్ఞల ఉల్లంఘన, చట్టవిరుద్ధంగా సాయుధులుగా గుమిగూడడం, దౌర్జన్య సంఘటన లు, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం వంటి ఆరోపణలను పురస్కరించుకుని దుండగులపై మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశాం' అని బద్లాపూర్‌లో సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలియజేశారు. క్షతగాత్రులైన పోలీస్ సిబ్బంది వివిధ స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు ఆయన తెలిపారు.


### 10 మందితో టాస్క్ ఫోర్స్...

### ట్రైనీ డాక్టర్ కేసుపై సుప్రీం

## కీలక నిర్ణయం

న్యూఢిల్లీ : వైద్యులు, ఆరోగ్య సేవ ప్రొఫెషనల్స్‌పై దౌర్జన్య సంఘటనలు పెరిగిపోతుండడంతో సుప్రీం కోర్టు మంగళవారం పది మంది సభ్యులతో ఒక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. వైద్య సిబ్బందికి భద్రత పెం పు, పని పరిస్థితుల మెరుగుదలకు జాతీయ ప్రొటోకాల్ రూపకల్పన చేసే బాధ్యత టాస్క్ ఫోర్స్‌ది. కోల్‌కతాలో ఇటీవల ఒక డాక్టర్‌పై హత్యాచారం జరిగిన నేపథ్యంలో కోర్టు ఈ నిర్ణయం తీసుకున్నది. టాస్క్ ఫోర్స్ తన మధ్యంతర నివేదికను మూడు వారాల్లోగాను, తుది ని వేదికను రెండు నెలల్లోగాను ఇవ్వవలసి ఉంటుంది. సుప్రీం కోర్టు ధర్మాసనానికి సారథ్యం వ హిస్తున్న ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) డివై చంద్రచూడ్ మహిళా డాక్టర్ల పరిరక్షణ జాతీయ ప్రయోజనం దృష్ట్యా అవశ్యమని, సమానత్వ సిద్ధాంతానికి ఇంతకు మించిన ప్రాముఖ్యం లేదని ఉద్ఘాటించారు.

అట్టడుగు స్థాయిలోపరిస్థితులు మారడానికి దేశం మరొక అత్యాచారం కోసం వేచి ఉండజాలదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. వైద్య వృత్తిదారుల పరిరక్షణకు చట్టాలు ఉన్నాయని, కాని అవి వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం లేదని బెంచ్ పేర్కొన్నది. పది మంది సభ్యుల టాస్క్ ఫోర్స్‌లో సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్‌కె సరియన్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్



ఆఫ్ నేషనల్ గ్యాస్ట్రాలజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎమ్ శ్రీనివాస్, బెంగళూరు నిమ్‌హాన్స్ నుంచి డాక్టర్ ప్రతిమా మూర్తిసహా ప్రముఖులు ఉన్నారు. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి, హోమ్ శాఖ కార్యదర్శి టాస్క్ ఫోర్స్ ఎక్స్ అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారని కూడా బెంచ్ ప్రకటించింది.

## మంకీపాక్స్ పై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటన

న్యూయార్క్: ప్రపంచాన్ని కలవరపెడుతున్న మంకీ పాక్స్ పై ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్‌వో) ప్రకటన అందరికీ కాస్త ఊరటనిస్తోంది. ఇది కరోనా వంటిది కాదని, మంకీ పాక్స్ ను నియంత్రించవచ్చని వెల్లడించింది. డబ్ల్యుహెచ్‌వో యూరప్ రీజినల్ డైరెక్టర్‌గా విధులను నిర్వహిస్తోన్న హాన్స్ క్లుగే మీడియాతో మాట్లాడుతూ.... మంకీ పాక్స్ వ్యాప్తి నియంత్రణకు, నిర్మూలనకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిని కలిసి కట్టుగా ఎదుర్కోవాలన్నారు. ఈ వైరస్‌ను మనం నియంత్రించుదామా? లేక మరోసారి నిర్లక్ష్యం, భయం దిశగా వెళదామా? అన్నారు. ఇదంతా ప్రపంచం స్పందనపై ఆధారపడి ఉంటుందన్నారు. దీనిని నిర్మూలించడం, నియంత్రించడం ప్రపంచం ముందున్న అతిపెద్ద సవాల్ అన్నారు. మంకీ పాక్స్ ఆఫ్రికా దాటి పలు దేశాలకు విస్తరిస్తోంది. కరోనా తర్వాత, మళ్లీ ఈ వైరస్ ప్రపంచాన్ని వణికిస్తోంది. భారత్‌లోనూ కొన్ని నగరాల్లో కేసులు నమోదయ్యాయి. మన దేశంలో 30 మంకీపాక్స్ కేసులు నమోదయ్యాయి. మార్చి 2024లో కేంద్ర ప్రభుత్వం చివరి కేసును గుర్తించింది.

# సిద్దిపేటలో హోరాహోరీ

సిద్దిపేట ప్రతినిధి/సిద్దిపేట అర్బన్: సిద్దిపేటలో రోజురోజుకూ కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్ మధ్య రచ్చ కొనసాగుతోంది. ఎప్పుడు ఏం జరుగుతతుందోనన్న ఆందోళన ప్రతి ఒక్కరిలో నెలకొంటోంది. సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం వందకు వంద శాతం రుణ మాఫీ చేయాలని, లేకుంటే రేవంత్ రెడ్డి పదవి నుంచి తొలగిపోవాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తుండగా..రుణమాఫీ చేశాం.. హరీష్‌రా వు ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పట్టుపడుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ సిద్దిపేటలో భారీ ర్యాలీకి పిలుపునివ్వడంతో రైతు రుణమాఫీపై గ్రామ స్థాయిలో పర్యటనకు బిఆర్ఎస్ కార్యాచరణ సమావేశం ఏర్పాటు చేసింది. దీంతో ఎప్పుడు ఏంజరుగుతుందోనన్న ఆందోళన ప్రతిఒక్కరిలో నెలకొంది. బిఆర్ఎస్ పార్టీ ఆద్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి భారీ సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు తరలివచ్చారు. కాంగ్రెస్ ర్యాలీకి హైదరాబాద్ నుంచి ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంఎల్ఎ మైనంపల్లి హనుమంతరావుతో పాటు మెదక్ ఎంఎల్ఎ మైనంపల్లి రోహిత్ ప్రత్యేక వాహనాలలో సిద్దిపేటకు చేరుకున్నారు. మార్గమధ్యంలో ఎంఎల్ఎ హరీష్‌రావు క్యాంపు కార్యాలయం ఉండడంతో పోలీసులు భారీగా మోహరించి భారీ గేట్‌లను ఏర్పాటు చేసి కాంగ్రెస్ ర్యాలీని దారిమళ్లించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎసిపి మధు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తుతో పాటు ప్రత్యేక బలగాలతో పట్టణంలో కవాతు నిర్వహించారు. ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం నుంచి బిఆర్ఎస్ నాయకులు బయటకు వస్తే అల్లర్లు జరుగుతాయని ముందస్తుగా అక్కడే భారీగా పోలీసుల బలగాలతో మోహరించారు. అనంతరం కాంగ్రెస్ ర్యాలీ బిజెఆర్ చౌరాస్తా నుంచి ఎన్సాన్‌పల్లి చౌరాస్తా, భారత్ నగర్ మీదుగా పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని అక్కడే సభ నిర్వహించారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



# రైతులందరికీ రుణమాఫీ చేస్తాం..

## ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**ఉమ్మడి నిజామాబాద్:** రుణమాఫీపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. నిజామాబాద్ కాంగ్రెస్ ఆఫీసులో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతు సంఘాలకు, రైతు నాయకులకు విజ్ఞప్తి రైతు సమస్యలు పరిష్కరించడానికి తాము ఉన్నామన్నారు. ఆందోళనలు విరమించండి.. మీ వద్దకు గ్రామాల నుండి వచ్చిన సమస్యలను తమకు కానీ, కలెక్టర్ కు కానీ తెలపాలన్నారు. అధికారులతో కలిసి రైతుల సమస్యలు పరిష్కరిద్దామన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రాధాన్యత లేదన్నారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే ప్రతి మండలానికి నోడల్ అధికారిని నియమించడం జరిగిందన్నారు. నోడల్ అధికారి పర్యవేక్షణలో వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు మీ సమస్యల పరిష్కారానికి మీ వద్దకు వస్తారన్నారు. పది సంవత్సరాలు మోసం చేసిన పార్టీలను నమ్మకండి.. పరేషాన్ కావాల్సిన అవసరం లేదు.. 31వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆందోళనలు అవసరం లేదు.. ప్రభుత్వం మీ గురించి ఆలోచిస్తుందన్నారు. సాంకేతిక కారణాల ద్వారా రైతుల ఇబ్బంది ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, పరిష్కరించి రుణమాఫీ చేస్తామన్నారు. బ్యాంక్ అధికారులకు ఆదేశాలు ఇచ్చాం.. అర్హులైన రైతుల వివరాలు ప్రభుత్వానికి పంపించండన్నారు. నేటి నుండి వారం రోజుల పాటు మీ గ్రామాలకు రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు వస్తున్నారు.. రుణమాఫీ కాని వారి వివరాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అధికారులు మీ గ్రామంలోని గ్రామపంచాయితీకి, రైతు వేదికలకు వస్తున్నారన్నారు. ఆందోళనకు దిగాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) రైతాంగాన్ని మోసం చేసి రుణమాఫీ విషయంలో మాట తప్పిందన్నారు. కానీ ఈ రోజు రెండు లక్షల రుణమాఫీ చేయడానికి సిద్ధంగా వున్న కాంగ్రెస్ పార్టీని బదనాం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అర్హులైన అందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహేర్ బిన్ హ్యాందాన్ పాల్గొన్నారు.

# కేడర్ బేస్డ్ పార్టీ బీజేపీ: కిషన్‌రెడ్డి



హైదరాబాద్ : బీజేపీ కేడర్ బేస్డ్ పార్టీ అని, వ్యక్తుల కోసం కాకుండా దేశం కోసం పనిచేసే పార్టీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నాంపల్లి కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలందరూ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు కలిగిన పార్టీ బీజేపీ అని తెలిపారు.

**సభ్యత్వ నమోదుతో పార్టీ మరింత బలోపేతం...**

పార్టీ మరింత బలపడేందుకు సభ్యత్వ నమోదు చేయాలని కిషన్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను దృష్టిలో పెట్టుకొని సభ్యత్వ నమోదు చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త వంద మందిని సభ్యులుగా చేర్పించాలని కోరారు. సభ్యత్వ నమోదును ఒక ఉద్యమంలాగా చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని, దీనికి సభ్యత్వం కీలకమని తెలిపారు. ఆన్ లైన్ సభ్యత్వం తీసుకోవాలని నిర్ణయమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 77లక్షల ఓట్లు వచ్చాయని చెప్పారు. వేలాది బూత్ లలో బీజేపీ నంబర్ వన్ గా నిలిచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటికి తూట్లు పొడుస్తుందన్నారు.

**50శాతం కూడా రుణమాఫీ జరగలేదు..**

రాష్ట్రంలో 50శాతం కూడా రుణమాఫీ జరగలేదని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీపై వాస్తవ పరిస్థితులు బయట పెట్టాలని, లేకుంటే ఆ వివరాలు బీజేపీయే బయట పెడుతుందన్నారు. ఏ గ్రామంలో రుణమాఫీ పూర్తిగా కాలేదని చెప్పారు. ఒక వైపు సభ్యత్వం చేస్తూనే రైతుల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తుందన్నారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్ లిబరేషన్ డే ను చేయాలన్నారు.

# ఏపి శాసనమండలి ప్రతిపక్ష నేతగా బొత్స

అమరావతి: బొత్స సత్యనారాయణ ఎంఎల్ సిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. కాగా వైసిపి పార్టీ ఆయనకు కీలక పదవి కట్టబెట్టింది. ఎంఎల్ సిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బొత్స, జగన్ ని కలిశారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణను ఏపి శాసనమండలి ప్రతిపక్ష నేతగా ప్రకటించారు జగన్. బొత్స మాట్లాడుతూ తనకి అసెంబ్లీ అయినా, శాసన మండలి అయినా ఒకటేనని అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తానన్నారు. తమని ఎదుర్కోడానికి మహా అయితే కేసులు పెడతారని, అంతకంటే ఏమీ చేయలేరని బొత్స అన్నారు. బొత్స సత్యనారాయణను మండలిలో ప్రతిపక్ష నేతగా ప్రకటించిన కొద్ది సేపటికే మండలి ఫ్లోర్ లీడర్ గా ఉన్న ఆళ్ల అప్పిరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా తాను చివరి వరకు జగన్ తోనే ఉంటానని అప్పిరెడ్డి ప్రకటించారు.



## స్వీపర్ లైంగిక వేధింపులు..

# బద్లాపూర్ భగ్గు



ముంబయి : ఒక పాఠశాల వాష్‌రూమ్‌లో స్వీపర్ నాలుగు సంవత్సరాల బాలికలు ఇద్దరిపై లైంగిక అత్యాచారం ఆరోపణ నేపథ్యంలో వేలాది మంది నిరసనకారులు మంగళవారం ఠాణె జిల్లా బద్లాపూర్ రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలను ఆక్రమించుకున్నారు. నిరసనకారులు స్థానిక పాఠశాల భవనాన్ని ముట్టడించారు. రైలు పట్టాలను ఆక్రమించుకుని పోలీస్ సిబ్బందిపై రాళ్లు రువ్విన నిరసనకారులపై పోలీసులు కేన్‌చార్జి చేశారు. ఆగ్రహోదగ్రులైన తల్లిదండ్రులతో సహా వందలాది మంది నిరసనకారులు లైంగిక అత్యాచారంపై తమ అసంతుష్టి వ్యక్తం చేయడానికి పాఠశాల భవనంలో విధ్వంసం సృష్టించారు. కాగా, సీనియర్ ఐపిఎస్ అధికారి ఆర్తీ సింగ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటుకు తాను ఆదేశించినట్లు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోమ్ శాఖ మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వెల్లడించారు. పాఠశాలపై చర్య తీసుకోగలమని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. ఈ కేసుపై ఫాస్ట్ ట్రాక్ దర్యాప్తు జరిపిస్తామని, దోషులను వదలబోమని షిండే తెలియజేశారు. బద్లాపూర్ స్టేషన్‌లో ఆగ్రహోదగ్రులైన నిరసనకారులు పోలీస్ అధికారులకు వ్యతిరేకంగా 'హై, హై' నినాదాలు చేయడం కనిపించింది. లైంగిక అత్యాచారానికి పాల్పడినట్లు భావిస్తున్న స్వీపర్‌కు మరణ శిక్ష విధించాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో 'విశాఖ కమిటీలు' ఏర్పాటు చేయనున్నట్లు, తమ ఆవరణల్లో సిసిటివి కెమెరాలు పని చేయడం లేదని తేలితే ఆ పాఠశాలలపై చర్య తీసుకోనున్నట్లు మహారాష్ట్ర విద్యా శాఖ మంత్రి దీపక్ కేసర్కర్ తెలిపారు. విద్యార్థినులు, ముఖ్యంగా 9, 10 తరగతులు, జూనియర్ కాలేజీల్లోనివారి సమస్యల వ్యక్తీకరణకు ఆ బృందాలు ఒక వేదిక ఏర్పాటు చేస్తాయని ఆయన చెప్పారు. బద్లాపూర్ పాఠశాలకు ఒక నోటీస్ జారీ చేసినట్లు, పాఠశాల ప్రిన్సిపాల్‌ను, కొద్ది మంది టీచర్లను, ఇద్దరు అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు కేసర్కర్ వెల్లడించారు. బద్లాపూర్ రైల్వేస్టేషన్‌లో నిరసన రోజు అంతా సాగింది. రైళ్లు నడవడాన్ని అనుమతించాలన్న అధికారుల విజ్ఞప్తులను పలువురు మహిళలతో సహా జనం ఖాతరు చేయలేదు. మధ్యాహ్నం నిరసనకారులను శాంతింపచేసేందుకు రాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ ప్రయత్నించారు. బాధితులకు న్యాయం, అరెస్టయిన నిందితునిక మరణ శిక్ష కోరుతూ వారు నినాదాలు చేశారు. కాగా, బద్లాపూర్ రైల్వే స్టేషన్‌ల నిరసన రాజకీయ ప్రేరేపితమైనదని ఠాణె జిల్లా ముర్బాద్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి ఎంఎల్ఎ కిసన్ కాథోరె ఆరోపించారు. ఆందోళనకారులు పొరుగు ప్రాంతాలవారని, బద్లాపూర్ వాసితులు కారని కూడా ఆయన ఆరోపించారు. బాధిత బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోవడానికి ముందు వారిని బద్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో 11 గంటల పాటు వేచి ఉండేలా చేశారని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

## లేటరల్ ఎంట్రీ విధానంపై...

# కేంద్రం పీఛేముడ్

న్యూఢిల్లీ : లేటరల్ ఎంట్రీ విధానంపై తీవ్ర విమర్శలు తలెత్తడంతో కేంద్రం వెనక్కి తగ్గింది. దీని కోసం ఇచ్చిన ప్రకటనను రద్దు చేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపిఎస్‌సి) ఛైర్‌పర్శన్ ప్రీతి సుదాన్‌కి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లేఖ రాశారు. ప్రధాని మోడీ ఆదేశాల మేర కు ఈ నిర్ణయం తీసుకున్నట్టు లేఖలో వివరించారు. సామాజిక న్యాయం పై మోడీ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించినందున ఈ అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీంతో మంగళవారం ఈ ప్ర కటనను రద్దు చేసింది. ఆగస్ట 17న యూపిఎస్‌సి 45 సంయుక్త కార్యదర్శులు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీలను ప్రభుత్వం లోని పలు శాఖల్లో నిపుణుల పేరిట (ప్రైవేట్ రంగానికి చెందిన వారితోపాటు ) లేటరల్ ఎం ట్రీ విధానం ద్వారా భర్తీ చేసేందుకు యుపిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై విపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ విధానం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను లాక్కుంటున్నారని రాహుల్ ఆరోపించారు. ఉన్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ఇప్పటికే ప్రాతినిధ్యం దక్కడం లేదని, దీన్ని మెరుగుపరిచే బదులు , లేటరల్ ఎంట్రీ ద్వారా వారిని ఆ పదవులకు దూరం చేస్తున్నారని ఇటీవల పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోపాటు పలు విపక్షాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యం లో కేంద్రం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.



**రాహుల్ స్పందన:** దీనిపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ల వ్యవస్థను కాంగ్రెస్ పరిరక్షిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. " రాజ్యాంగా న్ని , రిజర్వేషన్ వ్యవస్థను అన్ని విధాలా పరిరక్షి స్తాం.లేటరల్ ఎంట్రీ వంటి బీజేపీ ప్రయత్నాలను అ డ్డుకుంటాం. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించడం ద్వారా కులగణన ఆధారంగా సామాజిక న్యాయాన్ని అందిస్తాం" అని రాహుల్ పేర్కొన్నారు.

# ఓటుకు నోటు కేసు... ఆళ్ల రామకృష్ణారెడ్డి

## పిటిషన్లను కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఓటుకు నోటు కేసులో వైసిపి నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఓటుకు నోటు కేసులో సిబిఐ విచారణను కోరుతూ ఆయన పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. రాజకీయంగా కక్షలు ఉంటే బయట చూసుకోవాలని... కోర్టులను వేదికగా చేసుకోవద్దని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది. రాజకీయంగా బలం ఉంటే మళ్లీ పోటీ చేసి గెలవాలని ఆళ్ల రామకృష్ణారెడ్డికి హితవు పలికింది. ఈ సందర్భంగా పిటిషనర్‌కు ఉన్న అర్హత, రాజకీయ నేపథ్యంపై ధర్మాసనం ఆరా తీసింది. పిటిషనర్‌కు హెచ్చరికలు జారీ చేసింది. దాదాపు పదేళ్ల క్రితం రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనంగా మారిన ఓటుకు నోటు కేసుపై ఆళ్ల సుప్రీంకోర్టుకు వెళ్లారు.

## సంపాదకీయం

గురువారం, ఆగస్టు 22, 2024

### క్రీడల్లో మనమెందుకు

# వెనుకబడ్డాం...?

అనేక చిన్న చిన్న దేశాలు ఒలింపిక్స్‌లో పత కాలు ఎగరేసుకుపోతుంటే, మనదేశం అరకొర మెడల్స్‌తోనే సంతృప్తి పడుతోంది. ఒలింపిక్స్‌లో పతకాలు కొల్లగొడుతున్న అనేక దేశాలు మనతో పోలిస్తే పేద దేశాలే..ఆదాయ పరంగానే కాదు, మానవ వనరులలోనూ మనతో పోటీకి రాని దేశాలే. అయితేనేం, పతకాలు గెలుస్తున్నాయి. అక్కడి ప్రభుత్వాలు క్రీడల కోసం పెడుతున్న ఖర్చు మనతో పోలిస్తే బాగా ఎక్కువ. మనదేశం క్రీడల కోసం వార్షిక బడ్జెట్‌లో చేస్తున్న కేటాయింపులు తక్కువే. అరకొర కేటాయింపులతోనే పాలకులు కాలం గడుపుతున్నారు. దేశంలో క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతను గుర్తించి, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత నిస్సందేహంగా ప్రభుత్వాలదే. అవసరమైతే ఆయా క్రీడా విభాగాల్లో అత్యుత్తమమైన కోచ్‌లను విదేశాల నుంచి రప్పించుకోవాలి. మన క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇప్పించాలి. అప్పుడే ఒలింపిక్స్ లో రెండంకెల పతకాలకు మనం చేరుకోగలం. దురదృష్టవశాత్తూ మనదేశంలో క్రీడలు ఇప్పటికీ ఒక లాభదాయకమైన కెరీర్ కాలేకపోయింది. చదువులో వెనుకబడిన వారు మాత్రమే ఆటలపై ఆసక్తి చూపుతారన్న అభిప్రాయం సమాజంలో బలంగా నాటుకుంది. ఈ అభిప్రాయంతో ఎంతమంది ఏకీభవిస్తారన్న అంశాన్ని పక్కన పెడితే, క్రీడల్లో భారత్ బాగా వెనుకబడి ఉందన్న విషయం వాస్తవం. ఒలింపిక్స్ పోటీలే దీనికి ఉదాహరణ. ఒలింపిక్స్ చరిత్రలో భారతదేశం మొత్తం 41 పతకాలను మాత్రమే గెలుచుకుంది. మిగతా దేశాలతో పోలిస్తే ప్రతి ఒలింపిక్స్‌లోనూ మనదేశం పతకాల వేటలో వెనుకబడే ఉంటోంది. మనకంటే విస్తీర్ణంలోనూ, మానవ వనరులలోనూ వెనుకబడ్డ అనేక చిన్న చిన్న దేశాలు ఒలింపిక్స్‌లో పతకాలు ఎగరేసుకుపోతుంటే, మనదేశం మాత్రం అరకొర మెడల్స్‌తోనే సంతృప్తి పడుతోంది. ఈ పరిస్థితికి అనేక కారణాలున్నాయి.. దేశంలోని చాలా మంది నాణ్యమైన విద్యను పొందుతున్న మొదటి తరం ఇది. దీంతో క్రీడలపట్ల తల్లితండ్రుల వైఖరి మారింది. పిల్లలు తమలా కష్టాలు పడకూడదని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. ఆటలతో సమయం వృథా తప్ప ప్రయోజనం ఏమీ ఉండదన్న ఒక స్థిరమైన నిర్ణయానికి తల్లిదండ్రులు వచ్చేశారు. తమ పిల్లలు పెద్దయ్యాక డాక్టరో, ఇంజనీరో కావాలని తల్లిదండ్రులు కలలు కంటున్నారు. అంతేకాదు, తమ కలలు సాకారం చేయాలంటూ చిన్నప్పటి నుంచే పిల్లలపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా, తల్లిదండ్రుల ప్రోత్సాహం కరువవుతోంది. దీంతో క్రీడలను కెరీర్‌గా ఎంచుకునే వైపు చిన్నారులు పెద్దగా కృషి చేయలేకపోతున్నారు. దేశంలో సగం జనాభా పేదరికంలో ఉన్న ప్పుడు, రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాల నుంచి వచ్చిన చిన్నారులు క్రీడలను కెరీర్‌గా మలచుకుంటారని ఆశించ డం కూడా దురాశే అవుతుంది. కొంత మంది చిన్నారులకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా, వారు ఆడుకోవడానికి సరైన ప్రాంగణాలు దొరకడం లేదు. క్రీడా ప్రాంగణాలకు అనువైన స్థలాలే కాదు, అసలు ఎకరం స్థలం కూడా దొరకని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్లే గ్రౌండ్‌లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా ఎక్కడా ఎకరం భూమి కూడా దొరకని దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇప్పటితరం చిన్నారులు ప్లే గ్రౌండ్‌లు లేని పాఠశాలల్లోనే చదువులు పూర్తి చేస్తున్నారు. క్రీడాకారులకు అనేక ప్రభుత్వరంగ సంస్థల్లో రిజర్వేషన్లున్నాయి. అయితే క్రీడాకారుల కోటాను సరిగా అమలు చేయడం లేదన్న ఆరోపణలు వస్తు న్నాయి. క్రీడల కోసం వార్షిక బడ్జెట్‌లో చేస్తున్న కేటాయింపులు కూడా తక్కువే. అరకొర కేటాయింపులతోనే పాలకులు కాలం గడుపుతున్నారు. మనదేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లాంటి జాతీయ స్థాయి సంస్థలున్నా.. క్రీడాభివృద్ధి కోసం చేస్తున్న కృషి నామమాత్రమే అనే విమర్శలు వస్తున్నాయి. క్రీడల అభివృద్ధి కోసం కృషి చేయాల్సిన సంస్థలు రాజకీయాల్లో మునిగి తేలుతున్నాయన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. అయితే క్రీడలకు సంబంధించి అనేక సోషలిస్టు దేశాల్లో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అయా దేశాల్లో స్టేట్ యూత్ డిపార్ట్‌మెంట్ల ద్వారా ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులను సోషలిస్టు దేశాలు తయారు చేసుకుంటున్నాయి. ఒలింపిక్స్‌లో మెడల్స్ కొల్లగొడుతున్నాయి. మనదేశంలో క్రీడల అభివృద్ధికి సంబంధించి పక్కా ప్రణాళిక అంటూ లేదు. క్రీడాకారులకు మౌలిక వసతులు కూడా కరువే. క్రీడాభివృద్ధి కోసం అంకితమై కృషి చేసే కోచ్‌లు, ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్లకు మనదేశంలో తీవ్ర కొరత ఉంది. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే సత్తా ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను ముందుగా గుర్తించాలి. ఆ తరువాత వారిని ప్రోత్సహించేలా పాలకులు చర్యలు చేపట్టాలి. అయితే మనం ఇక్కడో చేదు వాస్తవాన్ని అంగీకరించి తీరాలి. క్రికెట్‌కు క్రీడా సంఘాలు, పౌర సమాజం ఇచ్చినంత ప్రాధాన్యం ఇతర క్రీడలకు ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. ఈ విషయంలో ఆయా సంఘాల తీరు మారాలంటున్నారు క్రీడాభిమానులు. చైనా సహా అనేక దేశాలు తమ అథ్లెట్ల శిక్షణా పద్ధతులను మెరుగుపరచడానికి సాంకేతికతను కూడా బాగా ఉపయోగించుకుంటున్నాయి.

# భారత్ బంద్ విజయవంతం

## - బంద్ కు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు

## - ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకపోరాట కమిటి కన్వీనర్ తుంగ శివరాజ్

**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** ఎస్సీ, ఎస్టీలను వర్గీకరిస్తూ సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని ఎస్సి, ఎస్టి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం రోజున బంద్ ను రాజన్న సిరిసిల్ల జిల్లాలో విజయవంతం చేశారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా కలెక్టరేట్ కి చేరుకున్నారు.. కలెక్టర్ అందుబాటులో లేకోపోవడం తో ఏ వో కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ తుంగ శివరాజ్ మాట్లాడుతూ వర్గీకరణ అనేది రాబోయే తరాలకు రిజర్వేషన్లు లేకుండా చేస్తుందని అలాంటి వర్గీకరణ అనేది దేశంలోని ఎస్సి, ఎస్టి ప్రజలకు ప్రమాదకరమని, కేంద్ర ప్రభుత్వమైన బిజెపి రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగమే వర్గీకరణ అంశం అని వాటిని తిప్పి కొట్టాల్సిన సమయం వచ్చిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని అలాంటి నిర్ణయం సుప్రీంకోర్టు తీసుకోవడం చాలా హేయమైన చర్య అని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 మండలాల్లో భారత్ బంద్ విజయవంతం అయిందని, బంద్ కు సహకరించిన జిల్లాలోని విద్యా సంస్థలు, వాణిజ్య వ్యాపార సంస్థలు మరియు బంద్ ని విజయవంతం చేసిన ప్రతి మాల సోదరునికి




కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుంగ శివరాజ్, నాలుక సత్యం, జక్కుల యాదగిరి, బూర యాదగిరి, బొల్లం గణేష్, రాజశేఖర్, రాగుల రాములు,రోడ్డ రామచంద్రం, నీరటి శ్రీనివాస్, సిరిగిరి మురళి, న్యాత ముత్తయ్య, ఆర్మీ రాజు,అంగురి రంజిత్, మాల సంఘాల ఐక్య వేదిక నాయకులు,అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు అడ్డంగా వచ్చిన చెట్లను తొలగించిన ఇల్లంతకుంట పోలీస్ శాఖ




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** ఇల్లంతకుంట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో ఇల్లంతకుంట నుండి సిరిసిల్ల కి పోయే మార్గం గుండా రోడ్డు మీద కి సర్కార్ తుమ్మ చేట్లు మరియు పిచ్చి మొక్కలు రోడ్డు కు అడ్డంగా వచ్చిన చెట్లను తొలగించి వాహనాదారులకు ఇబ్బంది లేకుండా చేసిన పోలీస్ శాఖను ప్రజలు అభినందించారు పోలీస్ శాఖను చూసి అయినా నాయకులు మారుతారో లేదో చూడాలని అభిప్రాయాపడ్డారు

# షా నగర్ లో వృద్ధాప్య వైద్య శిబిరం




**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** రామడుగు మండలంలోని షా నగర్ గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు క్యాంపుకు వచ్చిన వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, షుగర్ కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, అర్షమలలు వంటి చికిత్సలు నిర్వహించి తగిన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రవీణ్ కుమార్, డాక్టర్ నీరజ, ఫార్మసిస్ట్ ప్రేమలత, ఎస్ సి ఎస్ మధు, గ్రామ కార్యదర్శి అనిల్, ఆశా వర్కర్ పెప్సీబా పాల్గొన్నారు.

# విద్యార్థినులకు అశ్లీల వీడీయోలు చూపించిన స్కూలు టీచర్



**అకోల(మహారాష్ట్ర):** పాఠశాల విద్యార్థినులకు అశ్లీల వీడియోలను చూపించి వారితో అసభ్యంగా ప్రవర్తించిన ఒక 47 ఏళ్ల ప్రభుత్వ పాఠశాల టీచర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కాగా..విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఆ టీచర్‌ను ఉద్యోగం నుంచి ప్రభుత్వం బర్తరఫ్ చేసినట్లు మహారాష్ట్రలోని అకోల జిల్లా పరిషద్ ఎగ్జిక్యూటివ్ అధికారి బి వైష్ణవి బుధవారం తెలిపారు. ముంబై సమీపంలోని బద్లాపూర్ పట్టణంలోని ఒక పాఠశాలపై కిండర్‌గార్టెన్ చిన్నారులపై లైంగిక దాడి జరిగినట్లు ఆరోపణలు రావడం, దీనిపై మంగళవారం తీవ్ర స్థాయిలో నిరసనలు వెల్లువెత్తిన పరిణామాల నేపథ్యంలో తాజా సంఘటన వెలుగుచూడడం గమనార్హం.

అకోల నగరానికి 40 కిలోమీటర్ల దూరంలోని కాజీఖేడ గ్రామంలోని జిల్లా పరిషద్ పాఠశాలలో తాజా ఘటన వెలుగు చూసింది. గడచిన నాలుగు నెలలుగా ప్రమోద్ సర్దార్ అనే టీచర్ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థినులకు తన మొబైల్ ఫోన్‌లో అశ్లీల వీడియోలు చూపుతూ, వాటిని చూడాలని వారిని ఒత్తిడి చేస్తున్నట్లు విద్యార్థినుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. బాధితులలో ఒక వద్యార్థిని ధైర్యం చేసి 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి టీచర్ గురించి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది.

వెంటనే స్పందించిన శిశు సంక్షేమ కమిటీ(సిడబ్లుసి) మంగళవారం తన సభ్యులను పాఠశాలకు పంపించింది. విద్యార్థులకు క్లాసు తీసుకోవాలన్న కారణం చూపి 8వ తరగతి విద్యార్థినులతో కమిటీ సభ్యులు విడిగా సమావేశమయ్యారు. గడచిన నాలుగు నెలలుగా టీచర్ ప్రమోద్ సర్దార్ నుంచి తాము ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను విద్యార్థినులు కమిటీ సభ్యులకు వివరించారు. బాలికల నుంచి వివరాలను రాబట్టిన కమిటీ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సిడబ్లుసి సభ్యుల నుంచి ఫోన్ రావడంతో మైనర్ బాలికల వాంగ్మూలాన్ని నమోదు చేసుకోవడానికి తమ పోలీసు బృందాన్ని స్కూలుకు పంపించినట్లు ఉరల్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ ధోలే తెలిపారు. అనంతరం టీచర్ ప్రమోద్ సర్దార్‌ను అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.


# మంత్రి పదవి కన్నా.. సినిమానే నా ప్రాణం: మంత్రి సురేష్ గోపి

**కొచ్చి(కేరళ) :** మంత్రి పదవిలో ఉండి సినిమాల్లో నటించినందుకు తనను పదవి నుంచి తప్పించిన పక్షంలో తాను బతుకుజీవుడా అని ఊపిరి పీల్చుకుంటానని రాజకీయ నేతగా మారిన మలయాళ సినీ నటుడు, కేంద్ర సహాయ మంత్రి సురేష్ గోపి వ్యాఖ్యానించారు. ఓట్టకొంబన్ చిత్రంలో నటించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి కోరానని, ఇంకా అది అందలేదని బుధవారం నాడిక్కడ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, టూరిజం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు. అయితే సెప్టెంబర్ 6 నుంచి తాను షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు ఆయన ప్రకటించారు. 20 నుంచి 22 చిత్రాలకు సంబంధించిన కథలు విని వాటిలో నటించడానికి అంగీకరించానని ఆయన వెల్లడించారు. సినిమాల్లో నటించడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కోరితే ఎన్ని చిత్రాలలో అని ఆయన అడిగారని సురేష్ గోపి తెలిపారు. తాను 22 సినిమాలు అని చెప్పినపుడు అమిత్ సా తన అభ్యర్థనను పక్కనపెట్టేశారని ఆయన తెలిపారు. అయితే అనుమతి ఇస్తానని మాత్రం ఆయన చెప్పారని, ఏదేమైనా తాను సెప్టెంబర్ 6న ఇక్కడ ఉంటానని కేరళ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన స్పష్టం చేశారు. తాను సినిమా షూటింగ్‌లో ఉన్నపుడు తన మంత్రివర్గ బాధ్యతల నిర్వహణ కోసం తన మంత్రిత్వ శాఖ నుంచి ముగ్గురు, నలుగురు అధికారులను ఇక్కడకు తెచ్చుకుంటానని, సినిమా సెట్స్‌లో ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటానని సురేష్ గోపి వివరించారు. తాను చేయాల్సింది ఇదేనని, ఒకవేళ కేంద్ర మంత్రి పదవి నుంచి తనను తొలగిస్తే బతికిపోయానని భావిస్తానని, ఇంతకు మించి తాను చెప్పలేనని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి పదవిని తాను ఆశించలేదని, ఇప్పటికీ తనకు ఆ కోరిక లేదని ఆయన అన్నారు. మంత్రి పదవిని ఇస్తున్నామని పార్టీ ఈనాయకత్వం చెప్పినపుడు వారి ఆజ్ఞను శిరసావించానని, తనను గెలిపించిన త్రిసూర్ ప్రజల కోసమే దీన్ని అంగీకరించానని ఆయన అన్నారు. పార్టీ నాయకుల ఆదేశాలను ఇప్పటికీ గౌరవిస్తానని, అయితే సినిమా(నటన) లేకపోతే తాను చనిపోయినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు.



## ‘ముఫాసా’కి సూపర్ స్టార్ వాయిస్ ఓవర్..






బారీ జెంకిన్స్ డైరెక్ట్ చేస్తున్న మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘ముఫాసా: ది లయన్ కింగ్’ డిసెంబర్ 20న భారతదేశంలో ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానుంది. 2019లో లైవ్- యాక్షన్ ది లయన్ కింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని కొనసాగిస్తూ, విజువల్‌గా అద్భుతమైన లైవ్ యాక్షన్ ముఫాసా: ది లయన్ కింగ్ విడుదలకు సిద్ధంగా ఉంది. ‘ముఫాసా’కి సూపర్ స్టార్ మహేష్ బాబు వాయిస్ ఇస్తున్నారు. ఆయనతో ప్రముఖ నటులు బ్రహ్మానందం పుంబాగా అలీ టిమోన్‌గా తిరిగి వస్తున్నారు. ఇక ఈనెల 26న ఉదయం 11.07 గంటలకు తెలుగు ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ అద్భుతమైన అసోసియేషన్ గురించి సూపర్ స్టార్ మహేష్ బాబు మాట్లాడుతూ “డిస్నీ బ్లాక్‌బస్టర్ లెగసీ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్, టైమ్‌లెస్ స్టోరీ టెల్లింగ్ నాకెంతో ఇష్టం. డిస్నీతో ఈ అసోసియేషన్ వ్యక్తిగతంగా చాలా ప్రత్యేకమైనది. డిసెంబర్ 20న తెలుగులో బిగ్ స్క్రీన్‌పై ముఫాసా: ది లయన్ కింగ్‌ను నా కుటుంబంతో పాటు నా అభిమానులు చూస్తారని ఎదురు చూస్తున్నాను”అని అన్నారు.

### కీలకమైన సన్నివేశాల చిత్రీకరణలో

# ‘తెలుసు కదా’



స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ న్యూ మూవీ ‘తెలుసు కదా’ రెగ్యులర్ షూటింగ్ కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. రాశి ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ లావిష్ గా నిర్మిస్తున్న ఈ సినిమా మొదటి షెడ్యూల్‌లో సిద్ధూ జొన్నలగడ్డ, రాశి ఖన్నాలపై టాకీతో పాటు సాంగ్ ని షూట్ చేశారు. తాజాగా కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ కొత్త షెడ్యూల్‌లో హీరోయిన్ శ్రీనిధి శెట్టి జాయిన్ అయ్యింది. ఈ షెడ్యూల్ లో చాలా కీలకమైన సన్నివేశాలని షూట్ చేస్తున్నారు. నిర్మాత టిజి విశ్వప్రసాద్ ఈ సినిమాని హై బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.

## ‘సరిపోదా శనివారం’ పెద్ద హిట్ కాబోతోంది

నేచరల్ స్టార్ నాని, క్రియేటివ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ఫిల్మ్ ‘సరిపోదా శనివారం’. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలో ఎస్‌జె




సూర్య పవర్ ఫుల్ రోల్ ప్లే చేస్తున్నారు. ఈ చిత్రాన్ని డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో నిర్మిస్తున్నారు. ఈనెల 29న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మూవీ యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ప్రెస్ మీట్‌లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ “దానయ్య ‘ఆర్‌ఆర్‌ఆర్’ లాంటి సక్సెస్ చూసిన తర్వాత అంత తొందరగా ఏదీ ఆనదు. కానీ ఈ సినిమా ఆనుతుందనే నమ్మకం వుంది. వివేక్ రెండు నెలలుగా నిద్రపోయింది లేదు. ఆ కష్టం తెరపై కనిపిస్తుంది. ఈసారి వాళ్ళందరి కోసం సినిమా వేరే లెవెల్‌కి రీచ్ అవ్వాలని కోరుకుంటున్నాను. ప్రీరిలీజ్ ఈవెంట్ 24న జరగబోతోంది”అని అన్నారు. ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ “ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత దానయ్య బ్యానర్ నుంచి వస్తున్న ఈ సినిమా తెలుగు స్టేట్స్ డిస్ట్రిబ్యుషన్ రైట్స్‌లో పార్ట్ చేసినందుకు థాంక్స్. ఎస్‌జె సూర్య గురించి ప్రత్యేకంగా చెప్పాలి. నాని, ఎస్‌జె సూర్య ఇద్దరూ పోటాపోటీగా నటించారు. ట్రైలర్ చూస్తూనే అర్ధమవుతోంది. వివేక్ చాలా సర్‌ప్రైజ్ చేశాడు. అంతకుముందు సినిమాలని సాఫ్ట్‌గా తీశాడు. ఈ సినిమాని ఇరగదీశాడు. నానితో మేము చేసిన ఎంసిఏ పెద్ద హిట్టు. దాన్ని దసరా బీట్ చేసింది. దసరాని సరిపోదా శనివారం బీట్ చేయబోతోందని ట్రైలర్ చూసి నమ్మకంగా చెప్పొచ్చు”అని పేర్కొన్నారు. ప్రొడ్యూసర్ డివివి దానయ్య మాట్లాడుతూ.. “ సరిపోదా శనివారం చాలా బాగా వచ్చింది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి నాని. మొదటి నుంచి చివరి వరకూ చాలా బాగా చేశారు. డైరెక్టర్ గారు కూడా అద్భుతమైన కథ రాశారు, గొప్పగా తీశారు. సూర్య, ప్రియాంక మోహన్ ఇలా అందరూ చక్కగా నటించారు. జేక్స్ బిజోయ్ చాలా అద్భుతమైన మ్యూజిక్ చేశారు. సినిమా పెద్ద హిట్ కాబోతోంది”అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ప్రియాంక మోహన్ పాల్గొన్నారు.

## ప్రత్యేక గీతంతో కొత్త రికార్డు



అగ్ర కథానాయికలు సైతం ఐటెమ్‌సాంగ్స్‌లో నర్తించడం ఇప్పుడు మామూలైపోయింది. వారి పాటలతో సినిమాకు కావాల్సినంత ప్రచారం వస్తుండటం, సదరు గీతాలు ప్రత్యేకాకర్షణగా నిలుస్తుండటంతో టాప్ హీరోయిన్స్ ఐటెంసాంగ్స్‌లో నటించడానికి ఏమాత్రం సంకోచించడం లేదు. తాజాగా హిందీ చిత్రం ‘స్త్రీ-2’లో ‘ఆజ్ కి రాత్’ అంటూ అగ్ర నాయిక తమన్నా చేసిన ఐటెంసాంగ్ సోషల్‌మీడియాలో రికార్డులు సృష్టిస్తున్నది. ఈ స్పెషల్‌సాంగ్ సినిమాకు చాలా ప్లస్ అయిందని అంటున్నారు. ఈ పాటకు సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ఇప్పటికే పదకొండుకోట్ల వ్యూస్ లభించాయి. ఇటీవలకాలంలో ఓ ఐటెంసాంగ్‌కు లభించిన అత్యధిక వీక్షణలు ఇవేనని చెబుతున్నారు. ఐదు నిమిషాల నిడివిగల ఈ పాటకు తమన్నా రెండుకోట్లు పారితోషికం తీసుకుందని, ఇది కూడా ఓ రికార్డని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఈ పాటలో తమన్నా వేసిన స్టెప్పులు చాలా పాపులర్ అయ్యాయి. రాజ్‌కుమార్ రావు, శ్రద్ధాకపూర్ జంటగా నటించిన ‘స్త్రీ-2’ ఈ నెల 15న విడుదలై భారీ వసూళ్లతో దూసుకుపోతున్నది.

